



## మానవహక్కుల వేదిక

# రెండవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజలారా

పరిపాలన అంటే ఏమిటి? పార్టీల ప్రయోజనాలు, పార్టీ నాయకుల ప్రయోజనాలు, అంతిమంగా వారి కిశోరాల ప్రయోజనాలు.

అభివృద్ధి అంటే ఏమిటి? ఆస్తులున్న వాళ్ళకు వాటిని వేగంగా, శరవేగంగా, సింగపూర్ వేగంగా పెంచుకునే అవకాశం.

శాంతి అంటే ఏమిటి? స్వచ్ఛందమైన మౌనం. కాకుంటే దానికి పోలీసు కాపలా.


సమత అంటే ఏమిటి? తాత ముత్తాతల నుంచి సంక్రమించిన సదవకాశాలను స్వేచ్ఛగా వాడుకునే ప్రతిభ.

భద్రత అంటే ఏమిటి? గ్రేహౌండ్స్, సల్వాజుడుం.

ఈ నిర్వచనాలతో సాగుతున్న పాలనలో మనం బతుకుతున్నాం. ప్రభుత్వమే కాదు, కోర్టులూ ఈ నిర్వచనాలే ఇస్తున్నాయి. మేధావులూ ఇస్తున్నారు, మీడియానూ ఇస్తున్నది. ఈ నిర్వచనాల గురించి కొట్లాటే హక్కుల ఉద్యమం.

**మే 26, 27 – 2007**
**శ్రీకాకుళం పట్టణం**
**బాపూజీ కళామందిర్**
**(ఏడు రోడ్ల జంక్షన్ దగ్గర)**

ఈ కొట్లాట తెలుగు ప్రజలకు బాగానే తెలుసును గానీ ఎందుకో ఈ మధ్య నీరసించినట్టున్నారు. మన రాష్ట్రానికి చెందిన దంపతులను గుజరాత్ పోలీసులు హత్య చేసినందుకు ఆ రాష్ట్రంలో పెద్ద పెద్ద పోలీసు అధికారులనే అరెస్టుచేశారని తెలిసి అందరమూ సంతోషించాం. కానీ మన రాష్ట్రానికి చెందిన కొన్ని వేల మందిని మన రాష్ట్ర పోలీసులే ఆ రకంగా హత మార్చారే. అయినా వారిలో ఒక్కరినైనా అరెస్టు చేయిం చలేకపోయామని బాధపడకుండా ఉండలేం.



పశ్చిమ బెంగాల్ రైతులు సింగూరు, నందిగ్రాంలలో వ్యవసాయ భూములను కంపెనీలకు కట్టబెట్టే నీతికి వ్యతిరేకంగా తిరగబడ్డారని విని సంతోషించాం. కానీ ఈ భూదానంలో ఆంధ్రప్రదేశ్‌తో పశ్చిమ బెంగాల్‌కు పోలిక ఎక్కడిది? ప్రత్యేక ఆర్థిక మండలులు నెలకొల్పే పోటీలో మనం దేశంలోనే రెండవ స్థానంలో ఉన్నాం. అయినా మనం ఏ ఒక్క చోటా వాటిని ఆపలేకపోయామని బాధపడకుండా ఉండలేం.

నర్మదా నదిమీద కడుతున్న సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్వాసితులు కోర్టు లోపలా, బయటా పట్టుదలగా చేస్తున్న పోరాటాన్ని అందరం అభినందిస్తున్నాం. మన పోలవరం సర్దార్ సరోవర్‌కు ఏ రకంగానూ తక్కువ కాకున్నా పోలవరం వ్యతిరేక ఆందోళన రెండు ధర్నాలు, మూడు సంఘీభావాలుగా మిగిలిపోయిందే అని బాధపడ కుండా ఉండలేం.


ప్రభుత్వాలు చేసేదెట్లాగూ చేసుకుంటాయి, మనకు దక్కేది దక్కించుకొని పక్కకు పోదామన్న వైఖరి అలవడిందేమో. పదిమంది కోసం గొంతు చించుకోవడమెందుకు, మన బాగు మనం చూసుకుందామని తెలివి మీరామేమో. ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రతి సమస్యనూ కాంగ్రెస్ – తెలుగుదేశం పార్టీల పంచాయతీగా మార్చిన మీడియా మన హక్కుల చైతన్యాన్ని బలహీనపరుస్తున్నదేమో.

పాలకులకు నిజానికి ఇంతకంటే కావలసింది లేదు. ఏ అన్యాయానికీ, అణచివేతకూ వారు జవాబు చెప్పనక్కర లేదు. తెలుగుదేశం పాలనలో జరగలేదా అంటే సరిపోతుంది. ప్రజలకు చెంద వలసిన వనరులు పెట్టుబడిదారీ కంపెనీలకు దత్తత చేస్తున్నందుకు సంజాయిషీ ఇవ్వనక్కర లేదు. తాను విదిల్చే నాలుగు పైసల నష్టపరిహారం సకాలంలో తీసుకోకపోతే అది కూడా దక్కదని బెదిరించి సాగించుకోవచ్చు. ఆ హితవు చెప్పేవాళ్ళు ఎక్కడో కాదు మన పక్కనే ఉంటారు.

ఇంకొంచెం ప్రజాస్వామికంగా కనిపిస్తూ కూడా సాగించుకోవాలంటే మాటల దుకాణాన్ని ఒకదాన్ని తెరవవచ్చు. చేసేవి చేస్తూ దానికి భిన్నంగా మాట్లాడుతూ ఉండవచ్చు. దానికోసం ఒక సోనియాగాంధీని కేటాయించవచ్చు. ఆగ్రహం తెప్పించవలసిన అబద్ధపు పాలనా సంస్కృతిని రాజకీయ కాలక్షేపంగా భావించే ధోరణిని ప్రజలకు అలవాటు చేసేయడం కూడా అప్రజాస్వామిక పాలనను సాగించుకోవడానికి తోడ్పడుతుంది. 'మావోయిజం సామాజిక ఆర్థిక సమస్యే తప్ప శాంతిభద్రతల సమస్య కాదు' అంటూనే వాళ్ళను రోజూ చంపుకుంటూ పోవచ్చు. పచ్చటి పొలాలున్న భూములను కంపెనీలకు ఇవ్వం అన్న విధాన ప్రవచనం గంభీరంగా చేస్తూ, ఎడమ చేత్తో పచ్చదనం తప్ప వేరే ఏమీలేని కాకినాడ పరిసర భూములలో ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పడానికి ఆమోదం ఇచ్చే పత్రం మీద సంతకం చేసేయొచ్చు. ప్రతీ ఒక్కరికీ పునరావాసం కల్పించనిదే ఏ ప్రాజెక్టూ చేపట్టం అని ప్రకటిస్తూ పునరావాసం తప్ప వేరే ఏమీ అడగని గంగవరం జాలర్లపైన కాల్పులు జరపవచ్చు. ఇళ్ళ స్థలాలు లేని పేదల కోసం 'ఆవాస్ యోజనాలు' రోజుకొకటి ప్రకటిస్తూ పట్టణ పేదలను ఊరవతలికి నిర్దాక్షిణ్యంగా నిత్యం విసిరేస్తూ ఉండవచ్చు. పేదలు తెలిసో తెలియకో అన్యాక్రాంతం చేసిన అసైన్డ్ భూములను తిరిగి వారికే ఇప్పించే మహోద్యమంలో భాగం

**అబద్ధాన్నీ అణచివేతనూ చూసి ఆగ్రహించడం మనం మరొకసారి నేర్చుకోవలసి ఉంది. లేకపోతే అన్నీ అందరికీ తేటతెల్లంగానే ఉంటాయి కాని అన్నీ యథాతథంగా సాగుతూనే ఉంటాయి. అన్నిటినీ యథాలాపంగా, కాలక్షేపంగా తీసుకునే సంస్కృతి నుంచి మన సమాజం బయటపడవలసి ఉంది. లేకపోతే దౌర్భాగ్యుల చావులు అభివృద్ధి సక్సెస్ స్టోరీలో పిట్టకథలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.**

గానే వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముప్పై ఏళ్ళు ఆదమరచి చట్టవిరుద్ధంగా అనుభవించిన పేదల భూములను ప్రభుత్వానికి ఉదారంగా అప్పగించాడని చెప్తూ, అటువంటి భూము లను పేదలకు ఇవ్వవలసిన అవసరమే లేకుండా చేసే చట్ట సవరణలు చేపట్టవచ్చు. రంగారెడ్డి వంటి జిల్లాలో పేదలకు ఒక గూడు కలిగి ఉండే అవకాశమే లేకుండా చేసే



యొచ్చు. జల యజ్ఞానికి ముందుషరతుగా నీటివనరుల మీద అందరికీ సమాన హక్కు ఉండేటట్టు నీటి హక్కులు నిర్ధారించమన్న డిమాం డుకు జవాబు చెప్పకుండా, ఏ ప్రాతిపదికా లేని ప్రాజెక్టుల యజ్ఞం చేపట్టి కోటి ఎకరాలకు నీళ్ళేమోగానీ కోటాను కోట్ల రూపాయల ప్రజాధనం సంతర్పణ చేయవచ్చు. రైతుల ఆత్మహత్యల నివారణ కోసం అని ఒక నిపుణుల కమిటీని వేసి వారి నివేదికలోని ఒక్క అంశాన్నీ అమలుచేయకుండా నీ పాలనలో ఎక్కువ మంది చనిపోయారా నా పాలనలో ఎక్కువ మంది చనిపోయారా అని ప్రతిపక్ష నాయకునితో వాదులాడుకుంటూ కాలం గడపవచ్చు.

అబద్ధాన్నీ అణచివేతనూ చూసి ఆగ్రహించడం మనం మరొకసారి నేర్చుకోవలసి ఉంది. లేకపోతే అన్నీ అందరికీ తేటతెల్లంగానే ఉంటాయి కాని అన్నీ యథాతథంగా సాగుతూనే ఉంటాయి. అన్నిటినీ యథాలాపంగా, కాలక్షేపంగా తీసుకునే సంస్కృతి నుంచి మన సమాజం బయటపడవలసి ఉంది. లేకపోతే దౌర్భాగ్యుల చావులు అభివృద్ధి సక్సెస్ స్టోరీలో పిట్టకథలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

హక్కుల ఉద్యమం ఒకనాడు మిలిటెంట్ పోరాటాలపైన అణచివేతనూ, చట్ట బాహ్యమైన పోలీసు హింసనూ వ్యతి రేకించే వేదికగా మొదలయింది. ఆ పరిస్థితీ కొనసాగుతున్నది, ఆ అవసరమూ కొనసాగుతున్నది. రాజకీయ కార్యకర్తలను వేటాడి చంపడం కోసమే ఉద్దేశించిన గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక పోలీసు బలగాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అసలు ఉండవచ్చునా, రాజకీయ అశాంతికి సామాజిక ఆర్థిక మూలం ఉందని గుర్తించినట్టు చెప్పుకునే పాలన అటువంటి వికృత సృష్టిని చేపట్టవచ్చునా అనే ప్రశ్నలు ఉంటుండగానే ఆ సృష్టిని ప్రధానమంత్రి స్వయంగా కీర్తించడం, దేశమంతా అనుసరించాలని ఉద్బోధించడం చూస్తున్నాం. నక్సలైట్లను ఎదుర్కొనడానికి అది కూడా చాలదని ప్రైవేట్ ప్రతీకారాన్ని ప్రోత్సహించే ప్రయత్నం మన దగ్గర గ్రీన్ టైగర్స్, కోబ్రాలతో మొదలై ఛత్తీస్‌గఢ్‌లో పాశవికమైన సల్వాజుడుం సృష్టికి దారితీయడం, దానిని సైతం ప్రధాన మంత్రి స్వయంగా ప్రశంసించడం చూస్తున్నాం. కరెంటు షాక్‌లతో సహా తీవ్రమైన చిత్రహింసలు, ఎన్‌కౌంటర్ హత్యలు నక్సలైట్లతో మొదలై అన్ని రకాల అనుమానితులకూ పాకడం చూస్తున్నాం.

హక్కుల ఉద్యమం ఆ తరువాత సామాజిక రాజకీయ అసమానతల నుంచి పుట్టిన హక్కుల అణచివేత పైన దృష్టి పెట్టడం, దానికి వ్యతిరేకంగా పనిచేయడం మొదలుపెట్టింది. ఆ అణచివేతా కొనసాగుతున్నది, ఆ అవసరమూ కొనసాగు తున్నది. స్త్రీలకూ, మైనారిటీలకూ గొంతునిచ్చే ఉద్యమాలు ఎప్పుడూ బలహీనంగానే ఉండగా, దళిత ఉద్యమమూ ఈ మధ్యకాలంలో బలహీనపడడం, మనిషిని మనిషిగా గౌర వించే సంస్కృతి వేగంగా క్షీణించడం అన్ని రకాల సామాజిక అణచివేతలను ఎన్నో రెట్లు పెంచింది. కులవివక్షను అంతం

హక్కుల లేమికీ, నిరాకరణకూ ప్రత్యక్ష పర్యవసానం విస్థాపన (నిర్వాసం), వలసలు, ఆకలి చావులు. ఆర్థిక సంస్కరణల పేరు మీద ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వనరుల యాజమాన్యం సమస్యను మరింత వికృతంగా తయారుచేస్తున్నాయి. హక్కుల ఉద్యమం ఈ రోజు అనివార్యంగా దీనిపైన ఎక్కువ దృష్టిపెట్టి పని చేస్తున్నది.

**మే 26 ఉదయం 10 గంటలకు**

సెమినార్

**అరుణారాయ్**

**ప్రొ. డి.నరసింహారెడ్డి**

**ప్రదీప్ ప్రభు**

**సుజాతోభద్ర**

★★★

**మే 26 సాయంత్రం**

**6 గంటలకు**

ఊరేగింపు

ఏడు రోడ్ల జంక్షన్ నుండి

★★★

**మే 27 సాయంత్రం**

**6 గంటలకు**

**బహిరంగ సభ**

బాపూజీ కళామందిర్‌లో

★★★

చేసే దిశలో ఒక ప్రాథమిక చర్యగా భావించే విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లకు అత్యున్నత న్యాయస్థానమే పనిగట్టుకొని అడ్డం పడుతున్నది. రాజ్యాంగ స్ఫూర్తికేకాదు రాజ్యాంగ సూత్రాలకు సైతం విరుద్ధమైన తీర్పులివ్వడానికి న్యాయమూర్తులు వెనకాడడం లేదు. స్త్రీలకు అధికారంలో భాగస్వామ్యం ఇస్తే వారి ప్రయోజనాలను కాపాడే విధాన రచన వారే చేస్తారని గుర్తించి నట్టు ప్రకటించి ఆ భాగస్వామ్యం నామమాత్రపు స్థాయి దాటకుండా అనం తంగా కాలక్షేపం చేస్తున్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత, గుజ రాత్ మారణకాండ తరువాత భారతదేశం ముస్లింలకు కూడా చెందు తుందా అన్న ప్రశ్న బలంగా ముందుకు రాగా, 60 ఏళ్ళుగా కూడా ఈ దేశం వారికి చెందలేదని రాజిందర్ సచార్ కమిటీ రిపోర్టు సవివరంగా స్పష్టం చేసింది.

కాగా, ప్రాథమిక జీవన వనరులైన భూమి, నీరు, అడవులు, ఖనిజ సంపదల యాజమాన్య హక్కు, వాటి వినియోగం ఇవ్వాళ ముఖ్యమైన హక్కుల సమస్యలుగా ముందుకొస్తున్నాయి. కొంతకాలంగా ఇవే ప్రధా నంగా వార్తలలో ఉంటున్నాయి. ఒరిస్సా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల లోనూ, మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర జిల్లాలలోను అడవి భూములను బాక్సైట్, ఇనుము తదితర ఖనిజాల కంపెనీలకు లీజుకివ్వడం పట్ల ఆది వాసీ సమాజం వ్యక్తం చేస్తున్న వ్యతిరేకత, కోట్లాది గ్రామీణులకు తిండిపెట్టే భూములను ప్రత్యేక ఆర్థిక మండలులకు దత్తం చేయడం పట్ల రైతాంగంలో అన్ని ప్రాంతాలలోనూ వ్యక్తమవుతున్న నిరసన, వనరుల వినియోగంలో అసమానత, వివక్షల గురించి తెలంగాణ వంటి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు లేవదీస్తున్న ప్రశ్నలు ఈ కోవకు చెందినవి. ఈ రంగంలో హక్కుల లేమికీ, నిరాకరణకూ ప్రత్యక్ష పర్యవసానం విస్థాపన (నిర్వాసం), వలసలు, ఆకలి చావులు. ఆర్థిక సంస్కరణల పేరు మీద ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వనరుల యాజమాన్యం సమస్యను మరింత వికృతంగా తయారుచేస్తున్నాయి. హక్కుల ఉద్యమం ఈ రోజు అనివార్యంగా దీనిపైన ఎక్కువ దృష్టిపెట్టి పనిచేస్తున్నది.

ఈ విశాల నేపథ్యంలో మన రాష్ట్రంలో తలెత్తుతున్న హక్కుల సమస్యలపైన మానవ హక్కుల వేదిక తొమ్మిది సంవత్సరాలుగా పని చేస్తున్నది. కరపత్రాలు, ఇతర ప్రచురణలు, సభలు, సమావేశాల రూపంలో హక్కుల అవగాహనను ప్రచారం చేస్తున్నది. ప్రజా ఉద్యమాలకు సహాయ సహకారాలు, సంఘీభావం అందజేస్తున్నది. న్యాయస్థానాల నుంచి హక్కుల కమిషన్ వరకు వివిధ చట్టపరమైన వేదికలలో ఫిర్యాదులు చేసి విచారణలలో పాల్గొంటున్నది. మన రాష్ట్రం లోనేకాక ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, కాశ్మీర్, కర్నాటక, గుజరాత్, పశ్చిమబెంగాల్, మణిపూర్ రాష్ట్రాలలో హక్కులకోసం జరుగుతున్న కృషికి సంఘీభావంగా కూడా పని చేస్తున్నది.

ఈ క్రమంలో మే నెల 26, 27 తేదీలలో మానవహక్కుల వేదిక తన రెండవ రాష్ట్ర మహాసభలను శ్రీకాకుళం పట్టణంలో జరుపుకుంటున్నది. ఈ సభలకు అన్ని రకాల సహాయ సహకారాలూ అందించి మీ సంఘీభావాన్ని తెలియ జేయమని కోరుతూ –

మానవ హక్కుల వేదిక

(Human right Forum) HRF

**10 మే 2007**